సాక్షి
వికారాబాద్

బుధవారం । 24 । జనవరి । 2024



ఎమ్మార్సీలకు కంప్యూటర్లు

విద్యాశాఖలో సాంకేతిక పరిజ్ఞానం పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 10లో▸



ఆస్పత్రికి స్థల పరిశీలన

కొడంగల్‌లో 100 పడకల ఆస్పత్రి నూతన భవనాల నిర్మాణం కోసం అధికారులు స్థల పరిశీలన చేశారు. 10లో▸



పోరాట యోధుడు నేతాజీ

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఆనంద్ సూచించారు. 11లో▸

న్యూస్‌రీల్

నలుగురు ఎస్‌ఐల బదిలీలు

అనంతగిరి: జిల్లాలో నలుగురు ఎస్‌ఐలను బదిలీ చేసినట్లు ఎస్పీ కోటిరెడ్డి మంగళవారం తెలిపారు. తాండూరు పీఎస్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న ఎండీ రవూఫ్‌ను బొంరాస్‌పేటకు, అక్కడ పనిచేస్తున్న శంకర్‌ను తాండూరుకు బదిలీ చేసినట్లు తెలిపారు. పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న శ్రీశైలం యాదవ్‌ను దౌల్తాబాద్ ఎస్‌ఐగా బదిలీ చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న వి.రమేష్‌ను వెయిటింగ్‌లో ఉంచారు.

ప్రత్యేక నిధులు ఇవ్వండి

స్పీకర్‌ను కోరిన జెడ్పీ చైర్‌పర్సన్



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

అనంతగిరి: జిల్లా పరిషత్ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయించాలని జెడ్పీ చైర్‌పర్సన్ పీ సునీతారెడ్డి స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కోరారు. మంగళవారం ఆమె స్పీకర్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధిపై చర్చించారు. జెడ్పీ భవన నిర్మాణానికి అదనపు నిధులు ఇవ్వాలని కోరారు. సీఎం జిల్లా కావడంతో అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా పనిచేస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ తెలిపారు. దీనికి స్పీకర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో దౌల్తాబాద్ జెడ్పీటీసీ కోట్ల మహిపాల్, మోమిన్‌పేట ఏఎంసీ మాజీ చైర్మన్ నరోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాతో ఉపాధి

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: ప్రభుత్వం నిర్వహించే జాబ్‌మేళాతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయని ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని నంబర్ వన్ స్కూల్ గ్రౌండ్‌లో ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. 50కి పైగా కంపెనీలు పాల్గొన్నాయి. 5వేల ఉద్యోగాలు కల్పనకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని యువతకు ఉపాధి కల్పించేందుకే జాబ్‌మేళా నిర్వహించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టిందన్నారు. చదువుకొని అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ప్రైవేటు, ప్రభుత్వం శాఖల్లో ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, ఇందులో భాగంగానే రాష్ట్రంలోనే మొట్టమొదటిగా పరిగి నియోజకవర్గంలో జాబ్‌మేళా నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దుల్, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, దోమ ఎంపీపీ అనసూయ, అధికారులు పాల్గొన్నారు.

పోలీసులకు క్రమశిక్షణ అవసరం

ఎస్పీ కోటిరెడ్డి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: విధి నిర్వహణలో పోలీసులకు క్రమశిక్షణ అవసరమని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. మంగళవారం ఎస్పీ కార్యాలయ ఆవరణలో ఏఆర్ కానిస్టేబుళ్లకు మొబిలైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులు విధుల్లో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. ఏఆర్ సిబ్బందిలో నూతన ఉత్తేజం నింపేందుకు శిక్షణ కార్యక్రమం దోహద పడుతుందన్నారు. 15రోజుల పాటు పరేడ్, ఫైరింగ్, లాఠీ డ్రిల్, మబ్ ఆపరేషన్ డ్రిల్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పోలీసులు విధి నిర్వహణ తోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అనంతరం సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేష్, ఏఓ జ్యోతిర్మనీ, ఆర్‌ఐలు సూరప్ప నాయుడు, అంజత్ పాషా, డీఎస్బీ ఇన్‌స్పెక్టర్ డీవీపీ రాజు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేషం, ఆర్ఎస్‌ఐలు పాల్గొన్నారు.



నారాయణపూర్‌లో బోనాలతో తరలివస్తున్న మహిళలు

వైభవం.. ఊరడమ్మ జాతర

తాండూరు మండలం పర్వతాపూర్, నారాయణపూర్ గ్రామాల్లో మంగళవారం ఊరడమ్మ జాతర నేత్ర పర్వంగా సాగింది. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలతో ఆయా ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. గ్రామంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం ఏర్పులసాని భవిష్యవాణి వినిపించారు.

– తాండూరు రూరల్



భవిష్యవాణి వినిపిస్తున్న ఏర్పులసాని

రిసార్ట్స్ దందా..!



ఇటీవల గోధుంగూడ సమీపంలో అధికారులు మూసివేసిన రిసార్టు

అనుమతులు లేకుండా పదుల సంఖ్యలో నిర్వహణ

- ప్రభుత్వ భూములు, చెరువుల్లోనూ ఏర్పాటు
- యథేచ్ఛగా అడ్వెంచర్ గేమ్స్
- నామమాత్రపు చర్యలతో సరి
- ఆదాయం కోల్పోతున్న సర్కారు

వికారాబాద్: జిల్లాలో రిసార్ట్స్ దందా యథేచ్ఛగా సాగుతోంది. కొంత కాలంగా నగరం నుంచి పర్యాటకుల రాక పెరగడంతో ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. రిసార్ట్స్ ఏర్పాటుకు 11 రకాల అనుమతులు అవసరం. కానీ ఏ ఒక్క అనుమతి కూడా లేకుండానే కొనసాగిస్తుండటం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. వికారాబాద్, పూడూరు, ధారూరు, నవాబుపేట, మోమిన్‌పేట తదితర మండలాల్లో ఐదారేళ్లుగా రిసార్ట్స్ కొనసాగుతుండగా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. వీటి ఏర్పాటుకు పోలీసు, గ్రామ పంచాయతీ, డీపీఓ, రెవెన్యూ తదితర శాఖల నుంచి విధిగా అనుమతులు పొందాలి. కానీ ఎవరూ అనుమతులు పొందిన దాఖలాలు లేవు. ఇటీవల అధికారులు వికారాబాద్ మండల పరిధిలోని ఆరు రిసార్ట్స్‌లకు నోటీసులు ఇచ్చారు. వాటికి అనుమతులు లేవని తేలడంతో మూసివేశారు. ఇంకా పలు చోట్ల రిసార్ట్స్ ఉన్నా పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

అనుమతులు లేకుండానే..

జిల్లా కేంద్రానికి సమీపంలోని అనంతగిరి, టెంపుల్, ఫారెస్టు, కొండలను తిలకించేందుకు రోజుకు ఐదు వేల నుంచి పది వేల మంది వరకు పర్యాటకులు వస్తుంటారు. దీన్ని ఆసరాగా చేసుకొని పదేళ్ల కాలంలో అనంతగిరి చుట్టు పక్కల పదుల సంఖ్యలో రిసార్ట్స్ వెలిశాయి. ఇందులో బోటింగ్, నైట్ క్యాంపింగ్, పలు రకాల అడ్వెంచర్ గేమ్స్, ట్రెక్కింగ్, గేమింగ్, హోటల్స్, రాత్రి బస చేసేందుకు గదులు వంటి ఏర్పాట్లు ఉన్నాయి. అయితే వీటిని నిర్వహించాలంటే ముందుగా రెవెన్యూ, గ్రామ పంచాయతీ, ఫారెస్టు,నీటి పారుదల,అగ్నిమాపక,పోలీసు,ఎక్సైజ్ శాఖల నుంచి 11 రకాల అనుమతులు పొందాల్సి ఉంది. ఒక్క రాత్రి బస చేసేందుకు అక్కడ కల్పించే సౌకర్యాలు, అడ్వెంచర్ గేమ్స్‌ను బట్టి ఒక్కో జంటకు రూ.2,500 నుంచి రూ. 20వేల వరకు వసూలు చేస్తున్నారు. అయితే అనుమతులు తీసుకోకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

పట్టించుకోని అధికారులు

జిల్లాలో అనుమతులు లేని రిసార్టుల కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూములు, చెరువుల బఫర్ జోన్లలో రిసార్ట్స్ వెలుస్తున్నాయి. కొన్ని చోట్ల పశువులు నీళ్ల తాగేందుకు కూడా వీలులేకుండా చెరువులను ఆక్రమించుకొని కంచె వేసి నిర్మాణాలు చేపడుతున్నారు. కోట్‌పల్లి, సర్పన్‌పల్లి ప్రాజెక్టుల పరిసరాలు, వాటి బఫర్ జోన్లు పూర్తిగా ఈ కార్యకలాపాల కోసం వినియోగిస్తున్నారు. కొన్ని చోట్ల అధికారుల సహకారం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంకొన్ని చోట్ల చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. గతంలో అర కొర ఉన్న రిసార్ట్స్ నేడు పదుల సంఖ్యలో వెలిశాయి. చాలా వరకు ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతల అండదండలతోనే ఈ వ్యవహారం సాగుతోంది. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప అధికారులు స్పందించడం లేదు.

ఆరు రిసార్టులు మూసి వేత

అనంతగిరి గుట్టతో పాటు సర్పన్‌పల్లి ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో ఉన్న ఆరు రిసార్ట్స్‌లను ఇటీవల అధికారులు మూసి వేశారు. వైల్డర్ నెస్ క్యాప్ సైట్, పెంగ్విన్స్, మూన్ లైట్ అడ్వెంచర్, టిక్కి విలేజ్, నేచర్ రిట్రీట్, అవని ఫార్మ్స్‌ల తోపాటు పూడూరు మండలంలోని రెండు రిసార్టులను ఇటీవల అధికారులు మూసిశారు. అయితే పూడూరు, ధారూరు మండలాల పరిధిలో పలు రిసార్టులు కొనసాగుతున్నట్లు సమాచారం.

అనుమతులు తప్పని సరి

ప్రభుత్వ అనుమతులు పొందిన తరువాతే రిసార్టులు నిర్వహించాలి. ప్రభుత్వ భూములు, చెరువులను ఆక్రమించి రిసార్టులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తాం. ఇప్పటికే పలు ప్రాంతాల్లో తనిఖీలు చేసి పర్మిషన్ లేని ఆరింటిని సీజ్ చేశాం. భవిష్యత్తులో కూడా తనిఖీలు చేస్తాం. రిసార్టులు నిర్వహించాలని భావించే వారు 11 శాఖల నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది.

– తరుణ్‌కుమార్, డీపీఓ

మంచి భవిష్యత్ ఇవ్వండి



దంపతులకు పిల్లలతోపాటు సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- కలెక్టర్ నారాయణరెడ్డి
- పిల్లలను దత్తత తీసుకున్న తల్లిదండ్రులు

వికారాబాద్ అర్బన్: దత్తత తీసుకున్న పిల్లల పాలన బాగా చూసుకోవాలని, వారికి మంచి భవిష్యత్ ఇవ్వాలని కలెక్టర్ సీ నారాయణరెడ్డి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శిశు గృహ ద్వారా నిర్వహించిన దత్తత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న దంపతులకు కలెక్టర్ పిల్లలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చట్టబద్ధంగా దత్తత తీసుకున్న పిల్లల ఆలనపాలన తోపాటు వారిని బాగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంక్షేమ శాఖ జిల్లా అధికారి లలిత కుమారి, శిశు గృహ మేనేజర్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతగిరి: ట్రెసా (తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్) ఆధ్వర్యంలో ప్రచురించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను మంగళవారం కలెక్టర్ నారాయణరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, రాహుల్‌శర్మ, ఆర్‌డీఓలు విజయకుమారి, శ్రీనివాస రావు, ట్రెసా రాష్ట్ర కార్యదర్శులు మనోహర చక్రవర్తి, అమరేంద్ర కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయేందర్, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు దీపక్, వికారాబాద్ డివిజన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నరేందర్, తాండూరు డివిజన్ ప్రధాన కార్యదర్శి వీరేష్ బాబు, తహసీల్దార్లు పద్మావతి, నియామత్ అలీ, వెంకటేశ్వరి, జిల్లా కమిటీ సభ్యులు సురేష్‌కుమార్, విజయ్, అరుణ్‌కుమార్, లింగం గోవర్దన్, అక్బర్ అలీ, బాలకృష్ణ పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం

వికారాబాద్ అర్బన్: గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం ఆయన జిల్లా అధికారులతో కలసి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎలాంటి లోటు పాట్లకు తావులేకుండా వేడుకలు ఘనంగా జరిగేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. అన్ని గ్రామ పంచాయతీలు, మండల స్థాయి కార్యాలయాలు, పాఠశాలల్లో ఉదయం 8 గంటలకు, కలెక్టరేట్‌లో ఉదయం 9గంటలకు జెండా ఆవిష్కరణ ఉంటుందని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సిబ్బందితో హాజరు కావాలని సూచించారు. ప్రోటోకాల్ ప్రకారం అందరిని ఆహ్వానించాలని, పారిశుద్ధ్య పనులు, తాగునీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. స్టాల్స్‌తో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్ పర్సన్ లీలాలక్ష్మారెడ్డి




మాట్లాడుతున్న లీలాలక్ష్మారెడ్డి

కద్లాల్: పర్యావరణ పరిరక్షణకు ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్ పర్సన్ లీలాలక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని ఎర్త్‌సెంటర్‌లో కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్, తెలంగాణ పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులకు నిర్వహించనున్న శిక్షణ శిబిరం మంగళవారం ప్రారంభమైంది. శిక్షణ శిబిరానికి నాగర్‌కర్నూల్, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన 65 మంది ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా లీలాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ, నాయకత్వం పెంపొందించడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. శిక్షణ శిబిరంలో నేర్చుకున్న పర్యావరణ పరిరక్షణ అంశాలను పాఠశాలల్లో ముందుకు తీసుకెళ్లాలని కోరారు. అనంతరం పలువురు పర్యావరణవేత్తలు, శాస్త్రవేత్తలు పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్రపై వివరించారు. కార్యక్రమంలో ఎస్‌సీఈఆర్‌టీ విశ్రాంత అధికారి వెంకట్‌రెడ్డి, పర్యావరణ శాస్త్రవేత్తలు ఉమామహేశ్వర్‌రెడ్డి, సురేశ్‌గుప్తా, నేల పర్మకల్చర్ నిపుణురాలు, పర్యావరణ ప్రచారకర్త స్నేహ, బాల చైతన్య కేంద్రాల నిర్వాహకుడు రజనీకాంత్, సీజీఆర్ సిబ్బంది వెంకటేశ్, బీరేశ్, లక్ష్మీప్రసన్న, నగేశ్, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక సిద్ధం చేసుకోండి

- అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

ఇబ్రహీంపట్నం రూరల్: మున్సిపాలిటీల్లో అభివృద్ధి కోసం 2024–25 సంవత్సరానికి గాను ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. రాబోయే సంవత్సరానికి గాను అభి వృద్ధి నిధులు, ఖర్చుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. హెచ్ఎండీఏ నుంచి రావాల్సిన నిధులపై ఆరా తీశారు. పన్నుల రూపకంగా వచ్చే నిధులు, ఖర్చు వివరాలను కమిషనర్, అకౌంట్స్ అధికారులను అడిగి వృథా ఖర్చులు తగ్గించాలని సూచించారు. ప్రభు త్వం నుంచి వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రెండు రోజుల్లో పాలకవర్గంతో బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ అమరేందర్‌రెడ్డి, టీపీఓ అబీబ్‌ఉన్నీసాబేగం, ఏఈ వీరాంజనేయులు, మేనేజర్ శ్రీనివాస్, అకౌంట్స్ అధికారి స్వాతి పాల్గొన్నారు.



బడ్జెట్ సమావేశాలపై అధికారులతో చర్చిస్తున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

ఫిబ్రవరి 8న అవిశ్వాస సమావేశం?


ఆదిబట్ల మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్‌ను తొలగించాలని పాలకవర్గం సభ్యులు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కొత్త చైర్మన్ ఎన్నిక కోసం ఫిబ్రవరి 8వ తేదీని ప్రకటించినట్లు తెలిసింది. నేడు లేదా రేపు పాలకవర్గం సభ్యులకు నోటీసులు అందజేయనున్నట్లు సమాచారం.

వాగునూ వదల్లేదు!

చంద్రాయన్ గూడ, అప్పారెడ్డిగూడ గ్రామాల మధ్య వాగులో నిర్మిస్తున్న ప్రహరీ



ప్రస్తుతం ప్రహరీ నిర్మిస్తున్న ప్రదేశంలో ప్రవహిస్తున్న వాగు (ఫైల్)



దర్జాగా ఆక్రమణ

- యథేచ్ఛగా ప్రహరీ నిర్మాణం
- చెరువుల ఉనికికి ప్రమాదం
- పట్టని అధికార యంత్రాంగం

నందిగామ:అది షాద్‌నగర్ నియోజకవర్గంలోనే అతి పెద్ద చెరువు.. ఆ చెరువు నిండితే చుట్టూ ఉన్న సుమారు 15 గ్రామాల్లో నీటికి ఢోకా ఉండదు. అలాంటి చెరువులోకి వచ్చే వాగుని ఆక్రమించుకొని అక్రమంగా ప్రహరీ నిర్మిస్తుండడం కబ్జారాయుళ్ల ఆగడాలకు అద్దం పడుతోంది. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం పట్టనట్టు వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది.

వివరాల్లోకి వెళ్తే..

మండల పరిధిలోని నర్సప్పగూడ, తీగాపూర్ శివారులోని అక్కమ్మ చెరువు శిఖం సుమారు 160 ఎకరాలు ఉండగా ఆయకట్టు 350 ఎకరాల వరకు ఉంటుంది. అప్పారెడ్డిగూడ ప్రాంతం మీదుగా వెళ్లే వాగు పారితేనే ఈ చెరువు నిండుతుంది. ఈ వాగు అప్పారెడ్డిగూడ, వీర్లపల్లి శివారుల మీదుగా అక్కమ్మ చెరువులోకి వస్తుంది. నందిగామ పంచాయతీ పరిధిలోని చంద్రాయన్‌గూడ నుంచి అప్పారెడ్డిగూడకు వెళ్లే దారిలో వాగుకు సమీపంలో ఇటీవల భూములు కొనుగోలు చేసిన కొంతమంది కన్ను ఆ వాగుపై పడింది. నందిగామ శివారులోని సర్వే నంబరు 1452లో భూములు కొనుగోలు చేసిన సదరు వ్యక్తులు వాగును ఆక్రమించుకొని ఏకంగా ప్రహరీ నిర్మిస్తున్నారు.దీంతో వాగు ఉనికి కోల్పోయే ప్రమాదం ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అతి పెద్ద వాగు నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడం ద్వారా వాగుకు మరోవైపు భూముల్లో నుంచి కోత పడి పంట పొలా లు దెబ్బ తినే అవకాశం ఉందని రైతులు అంటున్నారు.

నిబంధనలు ఇవీ..

వాగు 10 మీటర్ల వెడల్పు ఉన్నట్లయితే రెండు వైపులా 9 మీటర్ల వరకు బఫర్ కోసం వదిలేయాలి. పది మీటర్ల లోపు వెడల్పు గల వాగు అయితే రెండు వైపులా 2 మీటర్ల మేర బఫర్‌కు వదిలేసి ప్రహరీ నిర్మించుకోవాలి. ప్రభుత్వ భూమి అయినా, పట్టా భూమి అయినా ఇవే నిబంధనలు వర్తిస్తాయి. కానీ ఇక్కడ నిబంధనలు తుంగలో తొక్కిన సదరు వ్యక్తు లు ఇష్టానుసారంగా వాగులోనే నిర్మాణాలు చేపడుతున్నారు.దీంతో అక్కమ్మ చెరువు నిండేందుకు ఆధారమైన ఈ పెద్ద వాగు ఉనికి ప్రశ్నార్థకంగా మారింది.

అధికారులు ఏం చేస్తున్నట్లు..?


మండల కేంద్రమైన నందిగామకు అతి సమీపంలో రోడ్డు పక్కనే జరుగుతున్న ఈ తతంగం నిత్యం అదే దారిలో వచ్చివెళ్లే అధికారులకు తెలియకుండా ఉంటుందా.. తెలిసీ తమకెందుకులే అని వదిలేస్తున్నారా.. అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అక్కమ్మ చెరువులోకి వచ్చే వాగును ఆక్రమించుకొని చేపడుతున్న నిర్మాణాలను అడ్డుకోవాలని, చెరువులోకి నీరు యథావిధిగా వచ్చేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

అక్కమ్మ చెరువులోకి వచ్చే వాగును ఆక్రమించుకొని ప్రహరీ నిర్మిస్తున్నారనే విషయం మా దృష్టికి రాలేదు. కొన్ని రోజులుగా సెలవులో ఉన్నాను. వీలైనంత త్వరలో వాగును పరిశీలిస్తాం. ఒకవేళ అక్రమంగా నిర్మాణాలు చేపట్టినట్లయితే చర్యలు తీసుకుంటాం.

– కార్తీక్, ఇరిగేషన్ ఏఈ, నందిగామ

విచారణ చేయిస్తా



పాటు కాల్వలను, వాగులను ఎట్టి పరిస్థితుల్లో కబ్జా చేయకూడదు. చంద్రాయన్‌గూడ, అప్పారెడ్డిగూడ మధ్యన వాగుకు ఆనుకొని ప్రహరీ నిర్మిస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. ఆర్ఐ, సర్వేయర్‌ను పంపించి విచారణ చేయిస్తా.

– అయ్యప్ప, తహసీల్దార్, నందిగామ

క్లుప్తంగా

ఆత్మరక్షణకు కరాటే అవసరం
కలెక్టర్ నారాయణరెడ్డి



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్

పూడూరు: ఆత్మరక్షణకు ప్రతి ఒక్కరికి కరాటే అవసరమని జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రపంచ స్థాయి కరాటే పోటీల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ నెల 28న సరూర్‌నగర్‌లో జరిగే కరాటే టోర్నమెంట్ పోటీల్లో జిల్లా నుంచి 150 మంది కరాటే ఆటగాళ్లు పాల్గొంటున్నారని తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులు తప్పనిసరిగా కరాటే నేర్చుకోవాలన్నారు. టోర్నమెంట్ పాల్గొని జిల్లాకు ఎక్కువ మెడల్స్ తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్‌లు శ్రీనివాస్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

దళితబంధుకు నిధులివ్వండి



వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

కొడంగల్ రూరల్ : గత ప్రభుత్వంలో మంజూరయిన దళితబంధు పథకాన్ని లబ్ధిదారులకు అందించాలని మంగళవారం పట్టణంలోని కాడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ బి.విజయకుమార్, ఎంపీడీఓ పాండులకు దళితబంధు సాధన సమితి, అంబేడ్కర్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం ప్రొసీడింగ్, ఐడి, దళితబంధు అకౌంట్స్ పూర్తయి చివరి దశలో ఉన్న లబ్ధిదారులకు ప్రస్తుత ప్రభుత్వం నిధులను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో దళితబంధు సాధన సమితి జిల్లా కన్వీనర్ ఎరన్‌పల్లి శ్రీనివాస్, అంబేడ్కర్ సంఘం నాయకులు రమేష్‌బాబు, నాయకులు దత్తు, దస్తప్ప, రావులపల్లి హన్మప్ప, శ్రీనివాస్, నరసింహులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



ఇసుక తరలిస్తూ పట్టుబడిన ట్రాక్టర్లు

తాండూరు టౌన్ : అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మైన్స్ ఏడీ జాకబ్ మంగళవారం రాత్రి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సాయంత్రం 5 గంటల తర్వాత ట్రాక్టర్లతో ఇసుక రీచ్ పాయింట్ నుంచి ఇసుకను తరలించకూడదనే నిబంధనలు విధించారు. అయితే రెండు ట్రాక్టర్లు అనుమతి తీసుకున్నప్పటికీ సాయంత్రం 5 గంటల తర్వాత పలుమార్లు రీచ్ పాయింట్‌ను నుంచి ఇసుకను తరలిస్తున్న విషయం తెలుసుకున్న ఏడీ జాకబ్ ట్రాక్టర్ల పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ.. నిబంధనల్లోని సమయం తర్వాత ఇసుక తరలిస్తే చర్యలు తప్పవన్నారు. ట్రాక్టర్ల యజమానులకు రూ.లక్ష వరకు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాలువలో పడి వృద్ధుడి మృతి

పరిగి: కాలువలో పడి ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన మిట్ట కొడూర్ గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బైండ్ల ఎల్లయ్య(70) గత రెండు సంవత్సరాలగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతుండేవాడు. ఈ క్రమంలో ఈ నెల 19న ఇంటి నుంచి బయటకు వెళ్లి రాలేదు. గ్రామ సమీపంలోని చెరువు కాలువలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. మృతుడి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎమ్మార్సీలకు కంప్యూటర్లు

- ఒక్కో కేంద్రానికి ఆరు చొప్పున..
- ఎంపిక చేసిన పాఠశాలలు, కేజీబీవీలకు అందజేత
- కంప్యూటర్ పరిజ్ఞానంపై ప్రత్యేక తరగతులు



పరిగి ఎమ్మార్సీకి వచ్చిన నూతన కంప్యూటర్లు

పరిగి: విద్యాశాఖలో సాంకేతిక పరిజ్ఞానం పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా జిల్లాలోని మండల విద్యావనరుల కేంద్రాలకు, ఎంపిక చేసిన పాఠశాలలు, కేజీబీవీలకు కంప్యూటర్ల పంపిణీ చేశారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని ఎమ్మార్సీలకు కంప్యూటర్లు చేరుకున్నారు. కొత్త మండలాలు కోట్‌పల్లి, చౌడాపూర్, దుద్యాల మినహా మిగతా 17మండలాల ఎమ్మార్సీలకు కంప్యూటర్లను అందజేశారు. గతంలో ఉన్న కంప్యూటర్ల కంటే మెరుగైన పరిజ్ఞానంతో ఈ కంప్యూటర్లు పనిచేయనున్నట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ఒక్కో ఎమ్మార్సీలకు ఆరు కంప్యూటర్లు

గతంలో ఒక్కో ఎమ్మార్సీలో ఒకటి రెండు కంప్యూటర్లు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం ఆరు కంప్యూటర్లు, ఒక ప్రింటర్‌ను ఇవ్వడంతో ఎమ్మార్సీలకు ఎంతో ఉపయోగం ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా 17 ఎమ్మార్సీలకు కలిసి మొత్తం 102 కంప్యూటర్లను 17 ప్రింటర్లను విద్యాశాఖ పంపిణీ చేసింది. ప్రతి మండలంలో యూడైస్, విద్యార్థుల వివరాలు, మధ్యాహ్న భోజనం అమలు, స్కూల్ యూనిఫాం, ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ సర్వశిక్ష అభియాన్ ద్వారా చేపడుతున్న వివిధ కార్యక్రమాల వివరాలన్నీ కంప్యూటర్లలో పొందుపరచనున్నారు. ఎమ్మార్సీలో ఎంఐఎస్ కోఆర్డినేటర్, ఒక డాటా ఎంట్రీ ఆపరేటర్ పనిచేస్తారు.

పాఠశాలలకు కంప్యూటర్ల మంజూరు

జిల్లాలోని ఎంపిక చేసిన పాఠశాలలకు, కేజీబీవీలకు, మోడల్ స్కూల్స్‌కు సైతం కంప్యూటర్లను అందజేశారు. ప్రతి 30 మంది విద్యార్థులకు ఒకటి చొప్పున పాఠశాల, కేజీబీవీలకు విద్యార్థుల సంఖ్యను బట్టి 5 నుంచి 10 కంప్యూటర్ల మంజూరు చేశారు. జిల్లా వ్యాప్తంగా 1063 ప్రభుత్వ పాఠశాలలు, 17 కేజీబీవీలు ఉండగా మొత్తం జిల్లాలోని 18 మండలాల్లో కలిసి 49 ఉన్నత పాఠశాలలకు, బషీరాబాద్, మర్పల్, నవాబ్‌పేట్, పరిగి నాలుగు మోడల్ స్కూల్స్‌లకు, బంట్వారం, బషీరాబాద్, దోమ, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, కుల్కచర్ల, మర్పల్లి, మోమిన్‌పేట్, పెద్దేముల్, పూడూర్, తాండూరు, యాలాల్ 12 కేజీబీవీలకు మొత్తం 65 పాఠశాలలకు మొత్తం 446 కంప్యూటర్లు మంజూరయ్యాయి. అలాగే, పాఠశాలలో కంప్యూటర్ బోధనకు ఉపాధ్యాయులను ప్రభుత్వం నియమించాలని కోరుతున్నారు.

ఉచిత ఇంటర్నెట్ సదుపాయం

కంప్యూటర్లకు సంబంధించి టేబుల్స్, తదితర సామగ్రిలు ఇంకా రావాల్సి ఉంది. అయితే ప్రతి కేంద్రానికి బీఎస్ఎన్ఎల్ ఉచిత ఇంటర్నెట్ సౌకర్యం కల్పించారు. విద్యుత్ సౌకర్యం, స్విచ్ బోర్డుల పిట్టింగ్ పనులు ఆయా ఎమ్మార్సీలో జరుగుతుండగా, కొన్ని చోట్ల వాటిని డబ్బాలోనే ఉంచారు. ఆరు కంప్యూటర్లతో ఒక క్యాబిన్ ఏర్పాటు చేస్తే అందులోనే అన్ని కంప్యూటర్ పనులు నిర్వహించేందుకు వీలుంటుందని ఆపరేటర్లు అధికారులకు సూచిస్తున్నారు. కొన్ని ఎమ్మార్సీలో సిబ్బంది కొరతతో ఇబ్బందులు పడుతున్నారు.

మరింత వేగంగా పనులు



గతంలో ఎమ్మార్సీల్లో ఒకటి రెండు కంప్యూటర్లు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం ఆరు కంప్యూటర్లను పంపిణీ చేసింది. కంప్యూటర్లు రావడంతో ఆపరేటర్లతో పాటు సీఆర్పీలను సైతం వినియోగించుకుని పనులను త్వరగా పూర్తి చేసుకోవచ్చు. పాఠశాలలో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అందించేందుకు కంప్యూటర్ ఉపాధ్యాయులను ప్రభుత్వం నియమించాలి.

హరిశ్చందర్‌నాయక్, మండల విద్యాధికారి, పరిగి

ధాన్యం డబ్బులకు రోడ్డెక్కిన రైతులు



రైతులతో మాట్లాడుతున్న ఎస్ఐ భరత్‌రెడ్డి

కొడంగల్ : కొడంగల్‌లో కొంతమంది దళారీలు రైతులను మోసం చేస్తున్నారు. ధాన్యాన్ని కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారు. తూకం, ధరలోనూ రైతులకు అన్యాయం చేస్తున్నారు. దీంతో ఆగ్రహించిన పలు గ్రామాల రైతులు మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నాకు దిగారు. పట్టణంలోని ఓ రైస్‌మిల్ యజమాని సుమారు రెండు కోట్లకు పైగా రైతుల నుంచి వరిధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. సదరు యజమాని డబ్బులు ఇవ్వకుండా బొంకుతున్నారని ఆరోపించారు. రోడ్డుపై బైటాయించి నినాదాలు చేశారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ భరత్‌రెడ్డి రైతులతో మాట్లాడారు. ధర్నా చేయడం సరికాదని పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో రైతులు ధర్నా విరమించి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. వ్యాపారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిచి మాట్లాడాలని డబ్బులు ఇవ్వకపోతే కేసు నమోదు చేయాలని రైతులు ఎస్ఐ భరత్‌రెడ్డిని కోరారు.

నెలరోజులు కావస్తున్నా..

బొంరాస్‌పేట: ధాన్యం కొనుగోలు సేకరించి నెలరోజులు కావస్తున్నా వ్యాపారి డబ్బులు ఇవ్వడం లేదని తుంకిమెట్ల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత రైతుల కథనం మేరకు.. కుల్కచర్ల మండలానికి చెందిన కోమటి ఆంజనేయులు మూడేళ్ల క్రితం తుంకిమెట్ల గ్రామానికి చెందిన చంద్రశేఖర్ కుమార్తెను వివాహం చేసుకొని ఇల్లరికం వచ్చాడు. కొడంగల్ మండలం రుద్రారం గ్రామానికి చెందిన మహేశ్ కూడా తుంకిమెట్ల గ్రామానికి ఇల్లరికం అల్లుడిగా వచ్చాడు. వీరిద్దరు కలసి గ్రామంలోని ఓ రైస్ మిల్లును లీజుకు తీసుకొని ఏడాదికి ఒకరి చొప్పున నిర్వహిస్తున్నారు. గత ఏడాది మహేశ్, ఈ ఏడాది ఆంజనేయులు మిల్లు నిర్వహించారు. ఈ క్రమంలో ఆంజనేయులు దాదాపు 200 మంది రైతుల నుంచి ధాన్యం సేకరించినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన డబ్బు రైతులకు ఇవ్వలేదు. వారం రోజుల నుంచి ఆంజనేయులు ఆచూకీ లేకపోవడం, సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ ఉండడంతో బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. తమకు న్యాయం చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

ఆస్పత్రి నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కొడంగల్ : పట్టణంలోని 50 పడకల ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా మార్చేందుకు వీలుగా నూతన భవనాల నిర్మాణం కోసం మంగళవారం స్థల పరిశీలన చేశారు. కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, వికారాబాద్ జిల్లా వైద్యాధికారులు ఆస్పత్రి ఆవరణలోని స్థలాన్ని పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న 50 పడకల స్థాయిని పెంచి వంద పడకలుగా మారిస్తే తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. మహిళల కోసం ప్రత్యేక విభాగం, ట్రామాకేర్ ఆస్పత్రి నిర్మించే అవకాశం ఉంది. కొత్తగా నిర్మించిన పోస్టుమార్టం గదిని ప్రారంభించాలన్నారు. కొడంగల్‌లో కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఆస్పత్రిలో రక్తనిధి కేంద్రం ఏర్పాటు, ఐసీయూ గది నిర్మాణం, డయాలసిస్ కేంద్రం స్థాయి పెంచాలని నిర్ణయించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్త, ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రప్రియ, డాక్టర్లు వీణా, సాకేత్ తదితరులు పాల్గొన్నారు.

100 శాతం పన్నులు వసూలు చేయండి

డీఎల్‌పీఓ అనిత



జీపీ కార్యదర్శులతో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ అనిత

ధారూరు: ధారూరు మండలంలోని 32 గ్రామ పంచాయతీల్లో ఈనెల 31 వరకు 100 శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని వికారాబాద్ డివిజనల్ పంచాయతీ అధికారి అనిత గ్రామ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం ధారూరు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో ఆమె సమావేశమయ్యారు. ఇంటి పన్నులు వసూలు చేసి ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. నిర్లక్ష్యం వహించొద్దని, నిర్ణీత టార్గెట్‌ను చేరుకోవాలన్నారు. రోజువారి శానిటేషన్ రికార్డులను రెగ్యులర్‌గా మేయింటెనెన్స్ చేసి అప్‌డేట్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. తడి, పొడి చెత్త నిర్వహణ పక్కాగా నిర్వహించాలన్నారు. పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించరాదని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల డెవలప్‌మెంట్ ప్లాన్‌ను సక్రమంగా చేపట్టాలని సూచించారు. అనంతరం ఆమె ఎంపీఓ షఫీఉల్లాతో కలిసి అంతారం గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. జీపీ అభివృద్ధికి సర్పంచు నర్సిరెడ్డికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆయా జీపీల గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో సీసీ రోడ్డు నిర్మాణం



రోడ్డు పనులు పరిశీలిస్తున్న మంజుల

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ పరిధిలోని గెరిగేట్ పల్లి గ్రామస్తుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను గుర్తించిన మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. మంగళవారం గెరిగేట్ పల్లి రైల్వే బ్రిడ్జి వద్ద నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. గెరిగేట్ పల్లి ప్రజల ఇబ్బందిని దృష్టిలో పెట్టుకొని సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణానికి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచంద్రారెడ్డి కృషి చేసినట్లు తెలిపారు. చైర్‌పర్సన్ ఆర్థిక సహకారంతో పాటు, దాత సహకారంతో సీసీ రోడ్డు నిర్మిస్తునందుకు గెరిగెట్ పల్లి గ్రామస్తులు ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం



పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

పరిగి/కుల్కచర్ల: పేదల అభ్యున్నతికి హామీ ఇచ్చిన ప్రతి సంక్షేమ పథకాన్ని అమలు చేస్తామని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కుల్కచర్ల మండలంలోని ముజాహిద్‌పూర్ గ్రామ పరిధిలో నూతన గ్రామపంచాయతీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విడతల వారీగా తాము ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి కష్టపడిన ప్రతి ఒక్కరిని పార్టీ గుర్తి స్తుందన్నారు. అభివృద్ధి ఫలాలు అందని ప్రాంతాలను గుర్తించి మొదటి విడతలో వాటికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ముజాహిద్‌పూర్ గ్రామ అభివృద్ధికి ప్రత్యేకంగా సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీపీఓ తరుణ్‌కుమార్, ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, పంచాయతీరాజ్ డీఈ లక్ష్మయ్య, ఈఎ మణికుమార్, సర్పంచ్ లక్ష్మీఆనంద్, ఉప సర్పంచ్ చంద్రభూపాల్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజనేయులు, బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మాజీ ఎంపీపీ అంజిలయ్య, నాయకులు కుమ్మరి స్వామి, రవి, కృష్ణయ్య, చిన్న పులింగ వెంకటేష్, భీమయ్య, బాలముకుందం, యాదయ్య, చౌడాపూర్ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్య, ఉపాధ్యక్షుడు నరసింహనాయక్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగిలోని బృందావన్ గార్డెన్‌లో మంగళవారం నియోజకవర్గ సర్పంచ్‌ల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గం అయినా, జిల్లా అయినా అభివృద్ధి పథంలో నడపాలంటే ముందు గ్రామాలు అభివృద్ధి చెందాలన్నారు. గ్రామాల అభివృద్ధి సర్పంచ్‌లతోనే సాధ్యమవుతుందన్నారు. ఏ పార్టీ ఎంత ఎత్తుకు ఎదిగిన గ్రామ స్థాయి నుంచి రావాల్సిందే అని చెప్పారు. సర్పంచ్‌లు కష్టపడి పనిచేస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌వర్ధన్ రెడ్డి, ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, మేఘమాల తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

విల్లాలో చోరీ

- గోడ దూకి.. తాళం పగులగొట్టిన ముసుగు దొంగలు
- నాలుగు తులాల బంగారు పుస్తెల తాడు చోరీ
- కేసు నమోదు చేసిన పోలీసులు

మహేశ్వరం: విల్లా గోడ దూకి.. ఇంటి తాళం పగులగొట్టిన దుండగులు చోరీకి పాల్పడిన ఘటన సోమవారం అర్ధరాత్రి మహేశ్వరంలో చోటు చేసుకుంది. సీఐ మురి తెలిపిన వివరాల ప్రకారం.. తుమ్మలూరు పరిధిలోని శ్రీశైలం జాతీయ రహదారి పక్కన ఉన్న బీటీఆర్ మ్యాక్ ప్రాజెక్టు 619 నంబర్ విల్లాలో పుట్ట రాము దంపతులు నివాసం ఉంటున్నారు. సోమవారం విల్లా ప్రధాన రహదారి తలుపులు మూసేసిన అనంతరం.. రాము భార్య తన మెడలోని నాలుగు తులాల పుస్తెల తాడును టేబుల్ పైన పెట్టి నిద్రపోయారు. మంగళవారం అర్ధరాత్రి మ్యాక్ ప్రాజెక్టు గోడపైనున్న తీగలను కత్తిరించిన ముగ్గురు దొంగలు.. ముఖాలకు మాస్కులు ధరించి వంట గది తాళం పగుల గొట్టి విల్లాలోకి చొరబడ్డారు. హాల్‌లోని టేబుల్‌పైన పెట్టిన పుస్తెల తాడును తీసుకొని వెళ్తుండగా శబ్దం రావడంతో.. ఇంట్లో నిద్రిస్తున్న వారు దొంగదొంగ అని అరవడంతో గోడ దూకి పారిపోయారు. రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ రవీందర్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సీసీ పుటేజీలను తనిఖీ చేశారు. త్వరలోనే దుండగులను పట్టుకుంటామని తెలిపారు.

గృహిణి అదృశ్యం

పహాడీషరీఫ్: గృహిణి అదృశ్యమైన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బి.వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. షాహినగర్‌కు చెందిన షేక్ ఖదీర్ సోదరి నేహా బేగం(29)ను ఫలక్‌నామాకు చెందిన షరీఫ్ ఖాన్‌కు ఇచ్చి వివా హం జరిపించారు. వీరికి నలుగురు సంతానం. కాగా నెల క్రితం షరీఫ్‌ఖాన్ ఖతర్ దేశానికి వెళ్లడంతో ఆమె పుట్టింటికి వచ్చింది. ఈ నెల 17న పిల్లలతో కలిసి అత్తగారింటికి వెళ్లింది. సోమవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా అత్తగారింటి నుంచి వెళ్లిపోయింది. అత్తింటి వారి ద్వారా సమాచారం తెలుసుకున్న ఖదీర్ ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకుండా పోయింది. ఈ విషయమై బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 87126 62366 నంబర్‌లో సమాచారం అందించాలని కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



కలెక్టర్ ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

అనంతగిరి: మున్సిపల్ కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కార్మికులతో కలిసి అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు పెండింగ్ సమస్యపై మెమొరాండం, సమ్మె నోటీసు ఇచ్చి ధర్నా చేశారు. పెండింగ్‌లో ఉన్న వారికి వెంటనే వేతనాలు ఇవ్వాలన్నారు. యూనిఫామ్స్, సబ్బులు, నూనెలు, బూట్లు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మైపాల్, క్రిష్టయ్య, శంకర్, లక్ష్మయ్య, వెంకటప్ప, జంగమ్మ, లక్ష్మి, సత్యమ్మ, అశోక్‌కుమార్ ఉన్నారు.

ఉపాధిహామీపై ఓపెన్ ఫోరం



మాట్లాడుతున్న ఎంపీపీ

అనంతగిరి: గ్రామాల్లో రైతులకు ప్రయోజనం చేకూరేలా ఉపాధి హామీ పనులు చేపట్టాలని ఎంపీపీ చంద్రకళ అన్నారు. వికారాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన సోషల్ ఆడిట్ విషయంలో మంగళవారం మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవన్‌లో సామాజిక తనిఖీ ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో చేపట్టిన సోషల్ ఆడిట్ విషయాలు సభ దృష్టికి తెచ్చి చర్చించారు. సంవత్సరం పాటు గ్రామాల్లో జరిగిన పనులపై మాట్లాడారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీఓ స్టీవెన్ నీల్, ఎంపీడీఓ సత్తయ్య, ఎస్ఆర్‌పీ రజిత, ఎస్‌టీఎం అంజద్ అలీ, ఏపీఓ శీను, అంబుడ్స్‌మెన్ రాములు, ఈసీ నవీన్‌కుమార్, ఏవీఓ భార్గవి, డీఆర్‌పీలు, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పోస్ట్‌మెన్ సస్పెన్షన్

కుల్కచర్ల: చెత్త కుప్పలో ఆధార్, ఓటరు, పాన్ కార్డులు పడేసిన పోస్ట్‌మెన్ నర్సింలును ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. మూడు రోజుల క్రితం చెత్తకుప్పలో భారీగా ఆధార్, ఓటరు, పాన్‌కార్డులు లభించాయి. దీంతో పోస్ట్‌మెన్‌పై తపాలాశాఖకు ఫిర్యాదులు అందాయి. మహబూబ్‌నగర్ పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్ అలీం క్షేత్రస్థాయిలో విచారణ జరిపి సస్పెన్షన్ చేస్తున్నట్లు ప్రకటించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోస్ట్‌మెన్‌పై చర్యలు తీసుకున్నట్లు నవాబుపేట్ పోస్టాఫీస్ మేనేజర్ అమర్‌దీప్ తెలిపారు.

శీతాకాలం.. చన్నీళ్ల స్నానం

- కస్తూర్బాల్లో బాలికల దుస్థితి
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



కస్తూర్బా విద్యాలయం

దౌల్తాబాద్: బాలిక విద్యకు ప్రాధాన్యమిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు నిర్మాణమైన కస్తూర్బాల్లో సమస్యలు తిష్ట వేశాయి. దీంతో విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొక తప్పడం లేదు. పేద కుటుంబాలు, వలస కార్మికుల కుటుంబాల్లో అమ్మాయిల కోసం ఏర్పాటైన కేజీబీల్లో సరైన సదుపాయాలు లేకపోవడంతో బాలికలు సతమతమవుతున్నారు. చలికాలం సోలార్‌ప్లేట్లు పనిచేయక చన్నీళ్ల స్నానం, మరోవైపు ఆరోగ్యకిట్లు అందక విద్యార్థినులు బాధపడుతున్నారు.

పనిచేయని ఆర్వో ప్లాంటు

స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో అన్ని కస్తూర్బాల్లో ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అది పనిచేయడం లేదు. మరమ్మతులకు నోచుకోక మూలనపడింది. గతంలో ప్రత్యేకాధికారి బాగుచేయించినా ప్రస్తుతం ఎవరూ పట్టించుకోవడం లేదని విద్యార్థినులు వాపోతున్నారు. దీంతో అక్కడే ఉన్న ఓ బోరు నీటిని తాగిస్తున్నారని విద్యార్థినులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

తప్పని చన్నీళ్ల స్నానం

చలి తీవ్రత పెరుగుతున్నా కస్తూర్బాలో చన్నీటి స్నానం తప్పడం లేదు. లక్షలు వెచ్చించి సోలార్ హీటర్ నిర్వహణ మరమత్తులు చేయించకపోవడంతో మూలనపడి ఉన్నాయి. ముఖ్యంగా ఇక్కడ 230 మంది బాలికలు ఉన్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు తక్కువగా ఉండడంతో వేకువజామునే లేవాల్సి వస్తుందంటున్నారు. చలికాలం బోరు నీటితోనే స్నానం చేసేందుకు వణుకుతున్నారు. విద్యార్థులు చిన్న చిన్న సమస్యలు తలెత్తడంతో ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా కస్తూర్బాల్లో సమస్యలు తీర్చాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఆర్వో ప్లాంటు